- తాగునీటికి తిప్పలు

ఆదిలాబాద్ జిల్లాలో భూగర్భజలాలు అడుగంటిపోవడంతో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రంలోని కేఆర్‌కే కాలనీలో మంచినీటి సమస్య కారణంగా మున్సిపాలిటీ అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడంతో స్థానికులు మంచినీటిని పట్టుకునేందుకు బిందెలు, డబ్బాలతో క్యూ కడుతున్నారు. అధికారులు తమకు సరిపడా మంచినీటి సరఫరా చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. – ఆదిలాబాద్

భూసేకరణ పేరిట పొట్ట కొడుతున్నారు

మూడు పంటలు పండే సారవంతమైన భూములను నిమ్జ్ ప్రాజెక్టు కోసం అధికారులు బలవంతంగా భూసేకరిస్తుండటంపై సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం మామిడ్గి రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మామిడ్గి రైతు వేదికలో జహీరాబాద్ నిమ్జ్ ప్రాజెక్టు ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రాజు ఆధ్వర్యంలో భూసేకరణపై గ్రామసభ నిర్వహించారు. నిమ్జ్ ప్రాజెక్టు కోసం 1169 ఎకరాల భూమిని సేకరిస్తున్నామని, పట్టాభూములకు ఎకరానికి 15 లక్షల చొప్పున పరిహారం చెల్లిస్తామని నిమ్జ్ ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్ రైతులకు విజ్ఞప్తి చేయగా వారు అభ్యంతరం తెలిపారు. కొందరు రైతులు ప్రాజెక్టుకు భూములు ఇస్తామని చెప్పడంతో మరికొందరు అడ్డుకున్నారు. దీంతో రైతుల మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. -జహీరాబాద్

ఓబీసీల డిమాండ్ల సాధనకు ఉద్యమించాలి

- రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య
- బీసీ వాదానికి బీఆర్‌ఎస్ కట్టుబడి ఉంది
- రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు

హైదరాబాద్, మార్చి 12 (నమస్తే తెలంగాణ): ఓబీసీల డిమాండ్ల సాధనకు దేశవ్యాప్తంగా ఉద్యమించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఢిల్లీలోని ఏపీ భవన్ అంబేద్కర్ ఆడిటోరియంలో బుధవారం ఓబీసీ డిమాండ్లపై బీసీ మేధావుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చట్టసభల్లో బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. పంచాయతీ రాజ్ సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 50 శాతానికి పెంచాలని కోరారు. ఈ రిజర్వేషన్లకు రాజ్యాంగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీలకు మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని కోరారు. బీఆర్‌ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ.. బీసీ బిల్లుకు ఇది అనువైన సమయమని, బీఆర్‌ఎస్ పార్టీ బీసీ వాదానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎంపీలు అప్పలనాయుడు, అంబికా లక్ష్మీనారాయణ, నాగరాజు, రాజ్యసభ సభ్యుడు మస్తాన్‌రావు, బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల భరత్ కుమార్, ఏపీ బీసీ సంఘం అధ్యక్షుడు ఎన్ మారేశ్, దక్షిణాది రాష్ట్రాల ఓబీసీ సంఘం అధ్యక్షుడు జబ్బల శ్రీనివాస్, పీతాని ప్రసాద్, రాజ్‌కుమార్, శ్రీనివాసరావు, భూపే సాగర్, విపుల్, భోగి రమణ, శశి భార్గవి, కోటేశ్వరరావు, రాజశేఖర్, సుభాశ్ యాదవ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యంతో సోలార్ ప్రాజెక్టు వెనక్కి

పార్లమెంట్‌కు వెల్లడించిన కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి

హైదరాబాద్, మార్చి 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంతోనే 3000 మెగావాట్ల సోలార్ విద్యుత్తు ప్రాజెక్టు ఒప్పందం ఉపసంహరించుకోవాల్సి వచ్చిందని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి మండిపడ్డారు. బుధవారం పార్లమెంట్ ప్రశ్నోత్తరాల సమయంలో ప్రభుత్వ భూముల్లో సోలార్ విద్యుత్‌తోపాటు ఇతర సహజ విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటు, కేంద్రం రాష్ట్రానికి ఇస్తున్న రాయితీల వివరాలు తెలపాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవడం లేదని ఆగ్రహం వెల్లడించారు. పీఎం కిసాన్, పీఎం సూర్యఘర్ వంటి పథకాలను వినియోగించుకోవడంలో ప్రభుత్వం విఫలం అయిందని విమర్శించారు. ప్రభుత్వ భూములనే కాకుండా పీఎం కుసుమ్, పీఎం సూర్యఘర్ లాంటి పథకాల ద్వారా ప్రజలకు సబ్సిడీలు అందిస్తున్నామని వివరించారు. నిరుడు జూన్‌లో 4000 మెగావాట్ల కోసం అనుమతి ఇచ్చామని, ఆరునెలల తర్వాత కూడా ఎలాంటి పురోగతి లేకపోవడంతో 3000 మెగావాట్లను రద్దు చేయాల్సి వచ్చిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్ర ఎంపీలు ప్రభుత్వంతో మాట్లాడి కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకునేలా కృషి చేయాలని ఆయన సూచించారు.

రేషన్ బియ్యం వస్తలేవు

- రాష్ట్రవ్యాప్తంగా బియ్యం కొరత
- 12వ తేదీ వచ్చినా షాపులకు చేరని వైనం
- బియ్యం లేకపోవడమే కారణం
- సకాలంలో అందక లబ్ధిదారుల తిప్పలు
- సన్నబియ్యం పంపిణీపై స్పష్టత శూన్యం

హైదరాబాద్, మార్చి 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా రేషన్ బియ్యం కొరత ఏర్పడింది. ఫిబ్రవరి నెలాఖరులోగా రేషన్ షాపులకు చేరాల్సిన బియ్యం మార్చి 12 వరకు అందలేదు. దీంతో సకాలంలో రేషన్ బియ్యం అందక లబ్ధిదారులు తిప్పలు పడుతున్నారు. రేషన్ బియ్యం ఇంకెప్పుడస్తాయంటూ రేషన్ షాపుల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. వాస్తవానికి ఎంఎల్‌ఎస్ పాయింట్స్ నుంచి ప్రతినెలా చివరి తేదీలోగా రేషన్ డీలర్లకు బియ్యం సరఫరా చేస్తే మరుసటి నెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు. కానీ, గత రెండు నెలల నుంచి అలా జరగడం లేదు. ఈ నెలలో మరింత ఇబ్బంది ఎదురవుతున్నట్టు రేషన్ డీలర్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 17,200 వరకు రేషన్ షాపులు ఉన్నాయి. వాటిలో ప్రస్తుతం 40% షాపులకు కూడా బియ్యం అందలేని తెలిసింది. దీంతో లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దొడ్డుబియ్యం పంపిణీకే ఇన్ని ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వ ఇక సన్న బియ్యం ఎలా పంపిణీ చేస్తుందోనని సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

నిల్వలు లేకపోవడం వల్లే..

గోదాముల్లో బియ్యం నిల్వలు నిండుకోవడం వల్లే రేషన్ బియ్యం పంపిణీ ఆలస్యమవుతున్నట్టు తెలిసింది. గత 2–3 నెలలుగా పంపిణీకి అవసరమైన బియ్యం సేకరణలో అధికారులు విఫలమైనట్టు సమాచారం. కానీ, బియ్యం కొరతకు అధికారులు సన్నబియ్యాన్ని సాకుగా చూపుతున్నారు. ఉగాది నుంచి సన్నబియ్యం పంపిణీ చేస్తామని ప్రభుత్వం చెప్పడంతో దొడ్డుబియ్యం నిల్వలు తగ్గించేందుకు చర్యలు చేపడుతున్నట్టు చెప్తున్నారు. సన్నబియ్యం ఎప్పటి నుంచి పంపిణీ చేస్తారని ప్రశ్నిస్తే మాత్రం.. తెలియదని, ప్రభుత్వం నుంచి తమకు ఇంకా ఎలాంటి ఆదేశాలు అందలేదని చెప్తుండటం గమనార్హం. దీంతో బియ్యం కొరతను కప్పిపుచ్చేందుకు అధికారులు రెండు నాల్కల ధోరణిలో మాట్లాడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల అలసత్వం వల్లనే బియ్యం పంపిణీ ఆలస్యమైందనే అభిప్రాయాలు పౌరసరఫరాల శాఖలో వ్యక్తమవుతున్నాయి. ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వల్ల గోదాముల్లో అవసరమైన నిల్వలు లేక ఎంఎల్‌ఎస్ పాయింట్స్‌కు బియ్యం సరఫరా ఆలస్యమైనట్లుగా తెలిసింది. ప్రతినెలా చివరి తేదీలోగా ఎంఎల్‌ఎస్ పాయింట్స్‌కు రావాల్సిన బియ్యం.. ఈ నెలలో 5వ తేదీ తర్వాత ప్రారంభమైంది. కొన్ని జిల్లాల్లో ఇప్పుడిప్పుడే సరఫరా అవుతున్నట్టు సమాచారం.

సన్నబియ్యం పంపిణీ ఎప్పటి నుంచి?

రేషన్ షాపుల ద్వారా దొడ్డుబియ్యానికి బదులు సన్నబియ్యం పంపిణీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ సర్కారు.. తొలుత జనవరి నుంచి ఇస్తామని, ఆ తర్వాత సంక్రాంతి నుంచి అని ప్రకటించింది. తాజాగా ఈ గడువును ఉగాదికి పెంచింది. కానీ, ఉగాది నుంచైనా పంపిణీ చేస్తారా లేదా అన్నదానిపై స్పష్టత కొరవడింది. సన్నబియ్యంపై ప్రభుత్వం రేషన్ డీలర్లకు గానీ, ఎంఎల్‌ఎస్ పాయింట్స్‌కు గానీ ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంతో ఉగాది నుంచి పంపిణీ చేయడం కష్టమేనని సివిల్ సప్లయ్ అధికారులు చెప్తున్నారు. ఈ వానకాలం సీజన్‌లో ప్రభుత్వం 24 లక్షల టన్నుల సన్నవడ్లు కొనుగోలు చేసింది. వీటి ద్వారా 16 లక్షల టన్నుల సన్నబియ్యం ఉత్పత్తి అవుతాయి. రేషన్ లబ్ధిదారులకు ప్రతి నెల 2 లక్షల టన్నుల సన్న బియ్యం పంపిణీ చేయాల్సి ఉంటుంది. ఈ లెక్కన 16 లక్షల టన్నుల సన్నబియ్యం 8 నెలలకే సరిపోతాయి. అయితే ఆ తర్వాత పరిస్థితి ఏంటనే దానిపై అధికారులతోపాటు ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతోంది. యాసంగిలో అధికంగా దొడ్డు ధాన్యమే పండిస్తారు.. సన్నధాన్యం వచ్చేది తక్కువే కాబట్టి పంపిణీలో ఇబ్బంది తప్పదని అధికారులు భావిస్తున్నట్టు తెలిసింది. అందుకే సన్నబియ్యం ఎప్పటి నుంచి పంపిణీ చేస్తారన్న దానిపై స్పష్టత రావడం లేదు.

పాత డైరెక్టర్లనే పర్సన్ ఇన్‌చార్జీలుగా ఉంచండి

జీవో 75 అమలు నిలిపివేత

హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

హైదరాబాద్, మార్చి 12 (నమస్తే తెలంగాణ): డీసీఎంఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జీలుగా పాత డైరెక్టర్లనే కొనసాగించాలని హైకోర్టు తాజాగా ఆదేశాలు జారీచేసింది. పర్సన్ ఇన్‌చార్జీలను నియమిస్తూ ప్రభుత్వం జారీచేసిన జీవో 75 అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులను జారీచేసింది. డీసీఎంఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జీలుగా అదనపు కలెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం ఫిబ్రవరి 14న జారీ చేసిన జీవో 75, సహకార శాఖ కమిషనర్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఉమ్మడి జిల్లాలకు చెందిన ఖమ్మం మినహా మిగతా 8 జిల్లాల డీసీఎంఎస్ డైరెక్టర్లు హైకోర్టులో వేర్వేరుగా 8 పిటిషన్లను దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ కే శరత్ విచారణ చేపట్టారు.

విద్యావ్యవస్థను భ్రష్టుపట్టించిన రేవంత్

హైదరాబాద్, మార్చి 12 (నమస్తే తెలంగాణ): విద్యా వ్యవస్థను సీఎం రేవంత్‌రెడ్డి భ్రష్టు పట్టించారని బీఆర్‌ఎస్వీ ఉపాధ్యక్షుడు తుంగబాలు ధ్వజమెత్తారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. విద్యాశాఖ మంత్రి లేకపోవడం శోచనీయమని అన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆహారంలో బ్లేడ్లు రావటం దురదృష్టకరమని మండిపడ్డారు.

రేవతి అరెస్ట్ నిర్బంధ పాలనకు నిదర్శనం

- ప్రజాపాలనలో మీడియాకు స్వేచ్ఛలేదా..?
- ఎక్స్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, మార్చి 12 (నమస్తే తెలంగాణ): సీనియర్ మహిళా జర్నలిస్ట్ రేవతి అరెస్ట్ రాష్ట్రంలో కొనసాగుతున్న నిర్బంధ పాలనకు నిదర్శనమని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. బుధవారం ఎక్స్ వేదికగా ఆయన జర్నలిస్టులు రేవతి, తన్వీయాదవ్ అరెస్టును ఖండించారు. కాంగ్రెస్ సర్కారు తీరును ఒక రైతు వెల్లడిస్తున్న వీడియోను పోస్ట్ చేసిన జర్నలిస్టులను అరెస్ట్ చేయడం దారుణమని మండిపడ్డారు. ప్రజాపాలనలో మీడియాకు స్వేచ్ఛ అనేది లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. రాహుల్ గాంధీ చెబుతున్న రాజ్యాంగబద్ధమైన పాలన ఇదేనా? అని ప్రశ్నించారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు మీడియా, సోషల్ మీడియా గొంతుకలపై చేస్తున్న ఈ దాడులు, అక్రమ కేసులను రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు.

ఇది ప్రజాస్వామ్యమా లేక నియంతృత్వమా?

బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, మార్చి 12 (నమస్తే తెలంగాణ): జర్నలిస్టు రేవతి అరెస్టను మాజీ మంత్రి హరీశ్ రావు ఖండించారు. బుధవారం 'ఎక్స్' వేదికగా ఆయన స్పందించారు. ఇది ప్రజాస్వామ్యమా.. నియంతృత్వమా? అని ప్రశ్నించారు. రేవంత్ సర్కారు అరెస్టులతో ప్రశ్నలకు సమాధానం ఇస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జర్నలిస్టు రేవతిని ఉదయం 5 గంటలకు అక్రమ అరెస్ట్ చేయడం ద్వారా ప్రభుత్వం ఎంత అభద్రతా భావంలో ఉన్నదో స్పష్టమవుతున్నదని తెలిపారు. పత్రికా స్వేచ్ఛను, ప్రశ్నించే గొంతులను అణచివేయడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు సిగ్గుచేటని మండిపడ్డారు.

ప్రశ్నిస్తే బెదిరింపులు.. అరెస్టులా?: కవిత



హైదరాబాద్, మార్చి 12 (నమస్తే తెలంగాణ): మహిళా జర్నలిస్టు రేవతి అరెస్టును బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత ఖండించారు. బుధవారం 'ఎక్స్' వేదికగా ఆమె స్పందించారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనలో ప్రశ్నిస్తే బుకాయింపులు, బెదిరింపులు, అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. మరో ట్వీట్‌లో అసెంబ్లీ సమావేశాల రోజు ప్రజాప్రతినిధులను ఎలా అరెస్టు చేస్తారని కవిత ప్రశ్నించారు. పెండింగ్ బిల్లులు విడుదల చేయాలంటూ ప్రజాస్వామ్య పద్ధతిలో సీఎం రేవంత్ రెడ్డికి తమ గోడు చెప్పుకునేందుకు హైదరాబాద్ వస్తున్న తాజా మాజీ సర్పంచులను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. అధికారంలోకి వచ్చి 15 నెలల్లో రూ.లక్షా యాభై వేల కోట్లు అప్పు చేసి, గ్రామ పంచాయతీలు, సర్పంచ్‌లకు పైసా కూడా ఇవ్వని సీఎం రేవంత్ రెడ్డి సర్పంచులను కలిసేందుకు ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు.

పత్రికా స్వేచ్ఛను హరించడమే..

కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్

హైదరాబాద్, మార్చి 12 (నమస్తే తెలంగాణ): పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వామిక హక్కులను కాలరాయడమే కాంగ్రెస్ పాలనగా మారిందని రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్ ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతుల ఆవేదనను ప్రభుత్వానికి గుర్తుచేస్తూ వార్త ప్రజానీకానికి చేరవేసినందుకు జర్నలిస్టు రేవతిని అక్రమ అరెస్టు చేయడం సరికాదని మండిపడ్డారు. ప్రజాసమస్యలపై జర్నలిస్టులు మాట్లాడకుండా చేసి హామీలు ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారని మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు.

అక్రమ అరెస్టులను ఖండించాలి: సుమిత్రానంద్

రైతు ఆవేదనను ప్రసారం చేసినందుకు జర్నలిస్టులు రేవతి, తన్వీను పోలీసులు అరెస్టు చేయడాన్ని బీఆర్‌ఎస్ మహిళా విభాగం తరపున తీవ్రంగా ఖండిస్తున్నట్టు టీజీపీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్ తెలిపారు. ప్రశ్నించడమే నేరమా? ప్రజాస్వామ్యం ఇచ్చిన హక్కులను కాలరాయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమా? అని ప్రశ్నించారు. అక్రమ అరెస్టును ఖండించాలని మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.

మహిళా జర్నలిస్టుల అరెస్ట్

మొదటిపేజీ తరువాయి...

మహిళా జర్నలిస్టులు రేవతి, తన్వీ

తీసుకున్నది. బుధవారం తెల్లవారుజామున 4గంటలకే ఫైనాన్స్ డిస్ట్రిక్ట్‌లో ఉన్న 'పల్స్‌న్యూస్ బ్రేక్' చానల్ జర్నలిస్ట్ రేవతి ఇంటికి 18 మంది పోలీసులు చేరుకున్నారు. మఫ్టీలో వచ్చిన పోలీసులు జర్నలిస్ట్ రేవతిని అరెస్టు చేస్తున్నామంటూ తన ఫోన్‌తోపాటు ఆమె భర్త ఫోన్‌ను లాక్కున్నారు. ప్రభుత్వానికి, సీఎంకు వ్యతిరేకంగా ఓ‌రైతు మాట్లాడిన వీడియోను తన యూట్యూబ్ చానల్‌లో పోస్టు చేసినందుకు అరెస్టు చేస్తున్నట్టు ఆమెకు నోటీసు ఇచ్చారు. అదే సమయంలో కొత్తూరులో మరో మహిళా జర్నలిస్ట్ సంధ్య అలియాస్ తన్వీ యాదవ్ ఇంటికి పోలీసులు వెళ్లి ఆమెను కూడా అరెస్ట్ చేశారు. వారిని ఏ పోలీస్ స్టేషన్ తీసుకెళ్తున్నారో కూడా కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వలేదు. విషయం తెలుసుకున్న రేవతి తరపు లాయర్ సీసీఎస్ చేరుకొని వాకబు చేయగా, తమకేమీ తెలియదని వారు చెప్పారు. ఇదే క్రమంలో 8గంటల పాటు మహిళా జర్నలిస్టులిద్దరినీ రహస్యంగా విచారించారు. పోస్టులు పెట్టడం వెనుక అసలు కారణమేంటని పోలీసులు పదేపదే ప్రశ్నించినట్టు సమాచారం. కాసేపటికి మహిళా జర్నలిస్టుల అరెస్టు విషయం బయటకు రావడంతో సోషల్ మీడియాలో నెటిజన్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. మహిళా జర్నలిస్టుల అరెస్టును బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు.

ఎక్స్‌లో రేవతి వీడియో పోస్ట్..!

అంతకుముందు ఎక్స్‌లో రేవతి ఒక వీడియో పోస్ట్ చేశారు. 'నా ఇంటి గుమ్మం వద్ద పోలీసులు ఉన్నారు.. వారు నన్ను అరెస్ట్ చేయాలనుకుంటున్నారు. వారు నన్ను ఎత్తుకుని తీసుకెళ్లవచ్చు.. ఒక విషయం స్పష్టమవుతున్నది.. సీఎం రేవంత్ రెడ్డి నా గొంతు నొక్కాలని.. బెదిరించాలని చూస్తున్నారు. కుటుంబసభ్యులపై ఒత్తిడి పెంచాలని చూస్తున్నారు. నన్ను బెదిరించాలనుకుంటున్నారు' అని మాట్లాడిన వీడియో పోస్ట్ చేశారు. ఇదే వీడియోను సోషల్ మీడియాలో నెటిజన్లు ట్యాగ్ చేస్తూ రేవతి అరెస్టను సీరియస్‌గా ఖండించారు.

వీడియో పోస్ట్ చేసినందుకే అరెస్ట్: అడిషనల్ సీపీ విశ్వప్రసాద్

సోషల్‌మీడియాలో సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వీడియోలు పోస్ట్ చేసినందుకు పల్స్ యూట్యూబ్ చానల్ నిర్వాహకురాలు జర్నలిస్ట్ రేవతి, మరో జర్నలిస్ట్ బండి సంధ్య అలియాస్ తన్వీయాదవ్‌ను అరెస్ట్ చేశామని హైదరాబాద్ క్రైమ్ విభాగం అడిషనల్ సీపీ విశ్వప్రసాద్ తెలిపారు. బుధవారం సీసీఎస్ బిల్డింగ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మహిళా జర్నలిస్టుల అరెస్ట్‌కు సంబంధించిన వివరాలు అడిషనల్ సీపీ వెల్లడించారు. నిప్పుకోడి అనే ఎక్స్‌హ్యాండిల్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని తిడుతున్న వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారిందంటూ కాంగ్రెస్ పార్టీ సోషల్‌మీడియా విభాగం రాష్ట్ర కార్యదర్శి కైలాశ్ ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టారని, పల్స్ టీవీ ఉద్దేశపూర్వకంగానే ఈ వ్యాఖ్యలు చేయించినట్టు తమ దర్యాప్తులో తేలిందని విశ్వప్రసాద్ చెప్పారు. పల్స్ టీవీలో వచ్చిన ఈ వీడియోను నిప్పుకోడి అనే ఎక్స్ హ్యాండిల్‌లో ట్రోల్ చేశారని కేసు దర్యాప్తు చేసి ఈ ఇద్దరు జర్నలిస్టులను అరెస్ట్ చేసినట్టుగా ఆయన పేర్కొన్నారు. కైలాశ్ ఫిర్యాదు ఆధారంగా సెక్షన్ 67ఐటీయాక్ట్, 111బీఎన్‌ఎస్, 61(2),353(2),352 సెక్షన్ల కింద కేసులు నమోదుచేశామని ఆయన చెప్పారు. బుధవారం ఉదయం మాదాపూర్‌లోని పల్స్ టీవీ కార్యాలయంలో సోదాలు నిర్వహించి 2ల్యాప్‌టాప్‌లు, 2 హార్డ్‌డిస్కులు, లోగో, రూటర్, 7సీపీయూలు స్వాధీనం చేసుకున్నామని ఆయన పేర్కొన్నారు. రేవతిపై గతంలో ఎల్‌బీ నగర్, బంజారాహిల్స్‌లో కేసులు ఉన్నాయని విశ్వప్రసాద్ చెప్పారు. అరెస్ట్ చేసిన ఈ ఇద్దరిని నాంపల్లి కోర్టులో హాజరు పరచగా 14రోజుల రిమాండ్ విధించడంతో చంచల్‌గూడ జైలుకు తరలించారు.

రేవతి అరెస్టను ఖండించిన 'ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా'

పల్స్ న్యూస్ మేనేజింగ్ డైరెక్టర్ రేవతి అరెస్టను 'ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా' తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు బుధవారం ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు అనంత్‌నాథ్, జనరల్ సెక్రటరీ రుబెన్ బెనర్జీ, కోశాధికారి కేవీ ప్రసాద్ ఓ ప్రకటన విడుదల చేశారు. తెల్లవారుజామున రేవతితో పాటు, ఆమె భర్తను ఇంట్లో నుంచి పోలీసులు తీసుకెళ్లడం దారుణం అని అభిప్రాయపడింది. కాంగ్రెస్ ప్రభుత్వం రేవతి హక్కులను, వ్యక్తిగత భద్రతను కాపాడాలని డిమాండ్ చేసింది.

విచారణాధికారికి షోకాజ్ నోటీసులు జారీ

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, మార్చి 12 (నమస్తే తెలంగాణ): సైబర్ క్రైమ్ ఎస్‌హెచ్‌వో, ఈ కేసుకు విచారణాధికారిగా ఉన్న ఎస్ నరేశ్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ 12వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ జీ అనూష సంచలన తీర్పు వెల్లడించారు. ఈ కేసు గురించి కోర్టుకు పూర్తి వివరణ ఇవ్వాలని ఆదేశించారు. 'ఎప్పుడు అరెస్టు చేశారని కోర్టు ప్రశ్నించగా, 'తెల్లవారుజామున 40 మంది మగ పోలీసులు మఫ్టీలో బలవంతంగా ఇంట్లోకి చొరబడ్డారని పల్స్ న్యూస్ ఎండీ పీ రేవతి కోర్టుకు తెలిపారు. ' కోర్టు ఎదుట చెప్పలేని బూతులు మాట్లాడుతూ మానసికంగా వేధించారని, తనఫోన్ ఇవ్వమని తిట్టారని తెలిపారు. ఇంటి బయట ఉన్న తన భర్తను చితకబాది ఫోన్లు, ల్యాప్‌టాప్‌ను లాక్కొని వెళ్లారని ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. తనను పోలీస్‌స్టేషన్‌కు కాకుండా ఇతర ప్రాంతానికి తీసుకెళ్లి హింసించారని తెలిపారు. ' ఏ కేసులో తనను అరెస్టు చేశారో తెలపమని అడిగినప్పటికీ సమాచారమివ్వకుండా వ్యాన్‌లో కూర్చోపెట్టి పలు ప్రాంతాలకు తీసుకెళ్లినట్టు తెలిపారు. అరెస్టు చేసినట్టు తన భర్తకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని వాపోయారు. రెండో ముద్దాయిగా ఉన్న న్యూస్ రిపోర్టర్ బండి సంధ్య అలియాస్ తన్వీ యాదవ్‌ను సైతం కోర్టు ప్రశ్నించగా, ' తనను ఈడ్చి వాహనంలోకి పోలీసులు తోశారని, చేతికి తగిలిన గాయాలను చూపించి కోర్టుకు తెలిపారు. నిందితుల తరపున న్యాయవాది కిరణ్‌కుమార్ కోర్టుకు వాదనలు వినిపించారు. సీఎంపై ఓ వ్యక్తి చేసిన అనుచిత వ్యాఖ్యలను ప్రసారం చేసినంత మాత్రాన ఎలా కేసు నమోదు చేస్తారని ప్రశ్నించారు. 111 సెక్షన్ ఈ కేసుకు వర్తించదని, రాజకీయ కక్షసాధింపు చర్యలో భాగంగానే వారిపై కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. దీనిపై పీపీ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇరువైపులా వాదనలు విన్న న్యాయమూర్తి నిందితులిద్దరినీ రిమాండ్‌కు తరలించాలని ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో మహిళాజర్నలిస్టులను చంచల్‌గూడ జైలుకు తరలించారు.

న్యాయవాది లలితారెడ్డితో సీఐ వాగ్వాదం

అరెస్టు సమాచారం తీసుకోవాలని విచారణాధికారి నరేశ్ ఒత్తిడి చేయగా, న్యాయవాది లలితారెడ్డి తిరస్కరించారు. ఉదయం నుంచి అరెస్టు చేసినట్టు సమాచారమివ్వకుండా ఇప్పుడెలా ఇస్తారని ఆమె ప్రశ్నించడంతో సీఐ వాగ్వాదానికి దిగారు. ఆ తర్వాత అరెస్టుపై ఇప్పుడే తమకు సమాచారమిచ్చారని న్యాయవాది లలితారెడ్డి కోర్టుకు తెలిపారు.

వనపర్తి జిల్లా మోజెర్ల ఉద్యాన కళాశాలలో మొక్కలను పరిశీలిస్తున్న వీసీ దండా రాజిరెడ్డి

'ఉద్యాన మోడల్'తో కూరగాయల సాగు

- విద్యార్థి ఉద్యాన అంకుర పరిశ్రమలకు యూనివర్సిటీ నిధులు
- భూసార పరీక్షలు చేసిన తర్వాతే ఉద్యాన తోటలను పెంచాలి
- వాతావరణ ఆధారిత ఉద్యాన సలహాలతో చీడపీడల నివారణ
- తెలంగాణ ఉద్యానవర్సిటీ వైస్‌ఛాన్సలర్ డాక్టర్ దండా రాజిరెడ్డి

హైదరాబాద్, మార్చి 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ప్రతీ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో అవసరమైన కూరగాయలు, పండ్లు సొంతంగా పాఠశాలలోనే పెంచుకోవడానికి 'ఉద్యాన మోడల్'ను అభివృద్ధి చేస్తున్నామని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ దండా రాజిరెడ్డి తెలిపారు. అందులో భాగంగా 'ఎక్క గ్రూపు ఫౌండేషన్'తో కలిసి బుధవారం వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మోజెర్ల ఉద్యాన కళాశాలలో కెరీర్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాజిరెడ్డి మాట్లాడుతూ ఉద్యానమోడల్‌ను రాష్ట్రవ్యాప్తంగా అమలుచేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థి ఉద్యాన అంకుర పరిశ్రమల ఏర్పాటుకు నిధులు ఇవ్వడానికి యూనివర్సిటీ సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా భారత వాతావరణ కేంద్రం ఆటోమేటిక్ వెదర్ స్టేషన్ రాజిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ భగవాన్, అసోసియేట్ డీన్ డాక్టర్ పిడిగం సైదయ్య, ఎస్టేట్ ఆఫీసర్ నాగేశ్వర్‌రెడ్డి, అడ్వైజర్ వీరాంజనేయులు, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడు పల్లె రవికుమార్ గౌడ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ కవిత, పక్కన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

పల్లె రవికుమార్‌గౌడ్‌కు కవిత పరామర్శ

చండూరు, మార్చి 12 : రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ నాయకుడు పల్లె రవికుమార్‌గౌడ్ మంగళవారం తెలంగాణ భవన్‌లో ప్రమాదవశాత్తు జారి పడడంతో కాలు విరిగింది. గాయపడిన రవిని బుధవారం ఎల్బీనగర్‌లోని తన నివాసంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆమెతోపాటు ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మనుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, నాయకులు కాచం సత్యనారాయణ, బొల్ల శివశంకర్, అందోజు శంకరాచారి, నిరంజన్ గౌడ్, ఈడం కైలాస్ నేత నక్క సుధీర్, వర్కాల అంబేద్కర్ ఉన్నారు.